


VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 88 | శుక్రవారం 28 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## ప్రధాని బాలేన్ షా నాయకత్వానికి అగ్నిపరీక్షగా మారిన విపత్తు

- నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు
- ఇప్పటివరకు 359 మంది మృతి, వందలాది మంది గల్లంతు
- గల్లంతైన వారిలో సుమారు 300 మంది భారత యాత్రికులు
- సహాయక చర్యలు ముమ్మరం చేశామని ప్రకటించిన ప్రభుత్వం


2

## మొజ్తబా ఖొమైనీ బతికే ఉన్నారు, కానీ తీవ్రంగా గాయపడ్డారు

- ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగియనుందన్న డొనాల్డ్ ట్రంప్
- సుప్రీం లీడర్ ఖొమైనీ తీవ్రంగా గాయపడ్డారని సంచలన వ్యాఖ్యలు
- రాత్రికి రాత్రే ఇరాన్‌కు చెందిన 22 బోట్లను ధ్వంసం చేశామని వెల్లడి


2

## రాజకీయాల్లోకి జెన్ జీ.. ఇగో వీడి యువతను కలుపుకుపోవాలి


2

- ప్రామాణికత, భాగస్వామ్యం కోరుకుంటున్న జెన్ జీ యువత
- ఇగోను పక్కనపెట్టి యువతను భాగస్వామ్యం చేయాలన్న లోకేశ్
- నియోజకవర్గాల్లో యువత, ఇన్‌ఫ్లుయెన్సర్లతో చర్చిస్తామని వెల్లడి
- యువత నుంచి అద్భుతమైన ఆలోచనలు వస్తున్నాయని వ్యాఖ్య

# ధాన్యం నిల్వకు తెలంగాణ సర్కార్ భారీ ప్లాన్


2

తెలంగాణలో పెరుగుతున్న వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణకు అనుగుణంగా ఆధునిక నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఆధునిక ధాన్య సైలోలను నిర్మించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి ఈ అంశాలపై చర్చించారు. భవిష్యత్‌లో ధాన్యం నిల్వ అవసరాలను తీర్చేందుకు సంప్రదాయ గోదాముల పై మాత్రమే ఆధారపడటం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు.

## కేటీఆర్‌కు రాఖీ కడతారా, లేదా?.. కవిత రిప్లయ్ ఇదే!



- సోదరుడు కేటీఆర్ పై మాజీ ఎంపీ కవిత తీవ్ర అసంతృప్తి
- రాఖీ పండుగకు కూడా అందుబాటులో ఉండకపోవడం పై ఆవేదన
- బీఆర్ఎస్‌లో అంతర్గత సంక్షోభం వల్లే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం లేదని విమర్శ
- హరీశ్ రావు బీజేపీ మద్దతుతో పార్టీని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని ఆరోపణ

2

## జగన్‌కు ఇప్పుడే ఎల్ నినో గుర్తొచ్చిందా అంటూ మంత్రి పార్థసారథి ఫైర్


2

- బీసీ రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టులో ఎందుకు పోరాడలేదని నిలదీత
- ప్రజా సమస్యల పై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్
- రాయలసీమ ప్రాజెక్టుల పై జగన్ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలేనని విమర్శలు
- సెప్టెంబర్ 3న ఉత్తరాంధ్రకు పోలవరం జలాలు అందిస్తామని వెల్లడి

గత రెండేళ్లుగా బెంగళూరులో సేద తీరిన మాజీ ముఖ్యమంత్రి జగన్ కు అకస్మాత్తుగా ఇప్పుడు 'ఎల్ నినో' గుర్తుకు వచ్చిందా?" అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే, శాసనసభకు వచ్చి చర్చించాలే గానీ, సొంత మీడియా ముందు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ.. బీసీలు, రైతులపై జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని, ఆయన చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు.

## మహిళలపై ఎప్పుడూ ప్రెస్ మీట్ పెట్టను: కొండా సురేఖ ఎపిసోడ్ పై కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

- మహిళల పట్ల తనకు అపారమైన గౌరవం ఉందన్న అనిరుధ్ రెడ్డి
- కొండా సురేఖ గురించి బహిరంగంగా మాట్లాడొద్దని సీఎం ఆదేశించారని వెల్లడి
- క్రమశిక్షణ కమిటీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్న అనిరుధ్ రెడ్డి


2

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 28 ఆగష్టు 2026

## ముజ్తబా ఖొమైనీ బతికే ఉన్నారు, కానీ తీవ్రంగా గాయపడ్డారు

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం త్వరలోనే ముగియనుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ముజ్తబా ఖొమైనీ తీవ్రంగా గాయపడినప్పటికీ, ఇంకా ప్రాణాలతోనే ఉన్నారని పేర్కొన్నారు. ఒక కన్జర్వేటివ్ బ్రాడ్‌కాస్టర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ విషయాలను వెల్లడించారు. "ఆయన చనిపోయారని నేను అనుకోవడం లేదు. కానీ చాలా తీవ్రంగా గాయపడ్డారు. ఆయన శరీరం ఎడమ వైపు భాగం, చేయి, కాలు మొత్తం దెబ్బతిన్నాయి," అని ట్రంప్ తెలిపారు. అయితే, తన వ్యాఖ్యలకు ఆయన ఎలాంటి ఆధారాలు చూపలేదు. ఇరాన్ అధికారులు ఇప్పటికీ నిర్ణయాల కోసం ఖొమైనీని సంప్రదిస్తున్నారని, ఇది ఆయన బతికే ఉన్నారనడానికి నిదర్శనమని ట్రంప్ అభిప్రాయపడ్డారు. అమెరికా సైనిక చర్యల్లో భాగంగా రాత్రికి రాత్రే ఇరాన్‌కు చెందిన 22 బోట్లను ధ్వంసం చేశామని ట్రంప్ ప్రకటించారు. "మా నేవీ, సైన్యం అద్భుతంగా పనిచేస్తున్నాయి. ఈ యుద్ధంలో త్వరలోనే మేం పెద్ద విజయం సాధించబోతున్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎందుకు నిరసనలు చేయడం లేదని అడగ్గా.. అక్కడ నిరసనకారులపై కాల్పులు జరపడానికి సైన్యం, స్నిపర్లు సిద్ధంగా ఉన్నారని, అందుకే వారు బయటకు రావడం లేదని బదులిచ్చారు. ఇరాన్ నావికాదళం, వాయుసేన పూర్తిగా నాశనమయ్యాయని, ఆ దేశం చాలా బలహీన పడిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌ను అణ్వాయుధం దక్కించుకోకుండా నిరోధించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. 2015 నాటి అణు ఒప్పందం నుంచి వైదొలగాలన్న తన నిర్ణయాన్ని కూడా ట్రంప్ ఈ సందర్భంగా సమర్థించుకున్నారు.

## ప్రధాని బాలేన్ షా నాయకత్వానికి అగ్నిపరీక్షగా మారిన విపత్తు

మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుగా ఉంది నేపాల్ ప్రధాని బాలేన్ షా పరిస్థితి. ఇప్పటికే యువత నిరసనలతో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆయనకు, తాజాగా దేశంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను సవాల్‌గా, ఆయన నాయకత్వానికి అగ్నిపరీక్షగా మారాయి. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఐదు నెలలకే ఇంతటి తీవ్రమైన ప్రకృతి విపత్తును ఎదుర్కోవాల్సి రావడం గమనార్హం. టిబెట్ సరిహద్దుల్లోని మూడు జిల్లాల్లో సంభవించిన ఈ జల ప్రళయం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ విపత్తు 359 మంది ప్రాణాలను బలిగొంది. మరో 1,600 మందికి పైగా గల్లంతయ్యారు. వీరిలో మానసరోవర్ యాత్రకు వెళ్లిన సుమారు 300 మంది భారత యాత్రికులు కూడా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ విపత్తు నేపథ్యంలో ప్రధాని బాలేన్ షా వెంటనే రంగంలోకి దిగారు. వరద ప్రభావిత ప్రాంతమైన నువాకోట్‌లో స్వయంగా పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యల కోసం అందుబాటులో ఉన్న అన్ని వనరులనూ సమీకరిస్తున్నామని, జాతీయ ఏజెన్సీలు, ఎన్జీవోలు, అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి తక్షణ సాయం అందిస్తున్నామని ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రజలకు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా, ఖాట్మండులో జరిగిన ఓ సదస్సులో నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ మాట్లాడుతూ ప్రధాని బాలేన్ షా నాయకత్వ శైలిని వివరించారు. బాలేన్ షా వేగంగా ఫలితాలు రాబట్టాలని కోరుకునే నాయకుడని, ఆయన పనితీరుపైనే ఎక్కువగా దృష్టి సారిస్తారని తెలిపారు. మంత్రులకు బాధ్యతలు అప్పగించి వారిని నమ్ముతారని, సూక్ష్మస్థాయిలో జోక్యం చేసుకోకుండా కేవలం ఫలితాలను ఆశిస్తారని పేర్కొన్నారు. విదేశీ పర్యాటకుల భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఖనాల్ స్పష్టం చేశారు. నేపాల్ పౌరులతో సమానంగా విదేశీయుల క్షేమాన్ని కూడా చూసుకుంటామని, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటున్నామని హామీ ఇచ్చారు. సత్వరమే సహాయం అందించినందుకు భారత ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఒకవైపు ప్రకృతి విపత్తు సృష్టించిన విధ్వంసం, మరోవైపు తన కార్యాచరణ ఆధారిత పాలనను నిరూపించుకోవాలన్న ప్రధాని తపన.. ఈ రెండూ బాలేన్ షా తొలి నాళ్ల నాయకత్వాన్ని నిర్వచిస్తున్నాయి. ఈ కఠిన సమయంలో ఆయన ఎలా స్పందిస్తారన్నది ఆయన రాజకీయ భవిష్యత్తుకు అత్యంత కీలకం కానుంది.

## మహిళలపై ఎప్పుడూ ప్రెస్ మీట్ పెట్టను: కొండా సురేఖ ఎపిసోడ్ పై కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్‌పై ఆ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు మహిళల పట్ల అపారమైన గౌరవం ఉందని, మహిళలపై తాను ఎప్పుడూ ప్రెస్ మీట్ పెట్టనని ఆయన స్పష్టం చేశారు. సొంత తల్లి తిట్టినా సరే ఏమీ మాట్లాడకుండా సైలెంట్‌గా అక్కడి నుంచి వెళ్లిపోతానని, మహిళలు తిట్టారని భావించి వారిని తిరిగి విమర్శిస్తే సమాజంలోని మహిళలంతా మనపై రివర్స్ అయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళలు కన్నీళ్లు పెట్టుకుని వారి కంటి నుంచి ఒక్క చుక్క నీరు భూమిపై పడినా, ఆ కన్నీటి చుక్క సునామీగా మారి మనల్ని కొట్టుకుపోయేలా చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. అందుకే వారిపై మీడియా ముందు మాట్లాడే ప్రసక్తే లేదని, ఒకవేళ తనను ఎవరైనా తిట్టినా వాటిని అక్షింతలుగానే స్వీకరిస్తానని తెలిపారు. ఇక కొండా సురేఖ వివాదంపై పార్టీ నాయకులు ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. ఈ అంశం పై ఇప్పటికే కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సుదీర్ఘంగా విచారణ జరుపుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఏఐసీసీ, పీసీసీ లేదా సీఎం రేవంత్ రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తామంతా పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. తప్పు ఎవరు చేశారనేది దేవుడు చూస్తున్నాడని, క్రమశిక్షణ కమిటీ ఇచ్చే తుది నివేదికను తాము శిరసావహిస్తామన్నారు.

# ధాన్యం నిల్వకు తెలంగాణ సర్కార్ భారీ ప్లాన్

భవిష్యత్‌లో ధాన్యం నిల్వ అవసరాలను తీర్చేందుకు సంప్రదాయ గోదాములపై మాత్రమే ఆధారపడటం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. కొత్తగా నిర్మించే సైలోల ద్వారా అదనంగా 5 నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

**రబీలో 90 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు సన్నద్ధత**

రానున్న రబీ సీజన్‌లో రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. దీనికి అనుగుణంగా ముందస్తు నిల్వ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తక్షణ అవసరాల కోసం సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వద్ద సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఉందని అధికారులు మంత్రికి వివరించారు.

**ఆధునిక సాంకేతికతతో సైలోలు**

కొత్తగా ఏర్పాటు చేయనున్న సైలోల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ కోసం ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్ వ్యవస్థలు, యాంత్రిక రవాణా సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. నిల్వ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంతో ధాన్యంలో తేమ, పురుగులు, ఇతర కారణాల వల్ల కలిగే నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

# రాజకీయాల్లోకి జెన్ జీ.. ఇగో వీడి యువతను కలుపుకుపోవాలి

ఇరు. జెన్ జీ యువత ఆలోచనలకు అనుగుణంగా రాజకీయాలు మారాల్సిన అవసరం ఉందని, వారిని తక్కువ అంచనా వేయరాదని హితవు పలికారు. బుధవారం నాడు ముంబైలో జరిగిన 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డుల కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయాలు, పాలనలో యువత భాగస్వామ్యంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "యువతరంతో నా అనుభవం ద్వారా నేను నేర్చుకున్న అతిపెద్ద పాఠం చాలా సులభమైంది. వారిని ఎప్పుడూ తక్కువ అంచనా వేయొద్దు, వారిని తక్కువ చేసి మాట్లాడొద్దు. వారిని మొత్తం అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములను చేయాలి" అని అన్నారు. రాజకీయాల్లో యువత ప్రాధాన్యంపై ప్రస్తుత చర్చకు చాలా కాలం ముందే తాను, తమ ముఖ్యమంత్రి గారు యువతతో మమేకమవుతున్నామని లోకేశ్ గుర్తుచేశారు. తాము ఒక నియోజకవర్గానికి వెళ్లినప్పుడు, అక్కడి యువత, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రత్యేకంగా సమావేశమవుతామని వివరించారు. "'మేము ఇంకా మెరుగ్గా ఎలా చేయగలం?', 'ఈ నియోజకవర్గంలో విభిన్నంగా ఏం చేయొచ్చు?' అని వారిని అడుగుతాం" అని తెలిపారు. ఇలాంటి నిర్మాణాత్మక చర్చల నుంచి ఎన్నో అద్భుతమైన ఆలోచనలు పుట్టుకొస్తాయని, వాటిని కేవలం వినడమే కాకుండా, అమలు చేయడానికి తమ వద్ద ఒక పక్కా వ్యవస్థ ఉందని లోకేశ్ తెలిపారు. "యువత నుంచి వచ్చే ఆలోచనలను స్వీకరించి, వాటిని ఫాలో-అప్ చేసే విధానం మాకుంది. వారిని సంభాషణలో భాగం చేయడమే వారు కోరుకుంటున్న మొదటి విషయం అని నేను నమ్ముతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. యువత సూచనలు, ఆలోచనలతో పాలనను మరింత మెరుగుపరచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రాజకీయ నాయకులు కూడా తమ వైఖరిని మార్చుకోవాలని లోకేశ్ సూచించారు. "రాజకీయ నాయకులుగా మనం మన ఇగోని, అడ్డుగోడలను వదిలేయడం చాలా ముఖ్యం. ఈ రోజుల్లో యువత మీతో భావోద్వేగ స్థాయిలో మమేకమవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. వారు మీ నుంచి కోరుకునేది కేవలం ప్రామాణికత మాత్రమే" అని అన్నారు. కల్మషం లేనితనం, పారదర్శకతే భారతదేశంలో తర్వాతి తరం రాజకీయ నాయకులకు ముఖ్యమైన లక్షణాలుగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. "భారతదేశంలో నవతరం రాజకీయ నాయకుల నుంచి యువత ఆశిస్తున్నది అదేనని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# జగన్‌కు ఇప్పుడే ఎల్ నినో గుర్తొచ్చిందా అంటూ మంత్రి పార్థసారథి ఫైర్

మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ.. బీసీలు, రైతులపై జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని, ఆయన చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. జగన్ ఇదివరకు ఆవు కథ చెప్పేవారు, ఇప్పుడు కోతి, పులి కథలు చెబుతున్నారు అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గత ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క కరవు నివారణ చర్య కూడా చేపట్టని బలహీన ముఖ్యమంత్రి జగన్ అని పార్థసారథి విమర్శించారు. "బెంగళూరులో ఉన్న జగన్‌కు ఎల్ నినో గురించి తెలియకపోవచ్చు. కానీ ఇప్పుడు అకస్మాత్తుగా గుర్తుకు వచ్చింది. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం ముందునుంచే చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే వరి వంగడాలను ప్రోత్సహిస్తున్నాం. వరి, మినుము, పత్తి వంటి పంటలకు తక్కువ ప్రీమియంతోనే బీమా చేయిస్తున్నాం" అని వివరించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు చేసిన ద్రోహం, విధ్వంసం బయటపడుతుందనే భయంతోనే జగన్ అసెంబ్లీకి రావడం లేదని ఆరోపించారు.

**మండలిలో చర్చకు ఎందుకు రాలేదు?**

రైతులపై అంత ప్రేమ ఉంటే, ఎల్ నినో అంశంపై శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలతో ఎందుకు చర్చకు పట్టుబట్టలేదని మంత్రి పార్థసారథి ప్రశ్నించారు. "విలువైన మండలి సమయాన్ని డిప్యూటీ ఛైర్మన్‌ను పొగడటానికే సరిపెట్టారు. నాలుగు గంటలపాటు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతూ, డిప్యూటీ ఛైర్మన్‌ను పొగిడేందుకు సమయాన్ని వృథా చేశారు. పత్రికా ప్రకటనలతో సానుభూతి చూపిస్తే సమస్యలు పరిష్కారం కావు" అని స్పష్టం చేశారు.

**బీసీలను మోసగించిన వ్యక్తి జగన్**

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లను హైకోర్టు వ్యతిరేకిస్తే, దానిపై సుప్రీంకోర్టుకు వెళ్లి జగన్ ఎందుకు పోరాడలేదని పార్థసారథి నిలదీశారు. "జగన్ నిర్వాకం వల్ల 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారు. 1995లోనే చంద్రబాబు ప్రత్యేక చట్టం చేసి బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించారు. నామినేటెడ్ కాంట్రాక్టుల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు ఇస్తానని అసెంబ్లీ సాక్షిగా మాట తప్పిన వ్యక్తి జగన్. నేతి బీరకాయలో నెయ్యి ఎంత నిజమో, జగన్ మాటలు కూడా అంతే. బీసీలపై అంత ప్రేమ ఉంటే ఒక్క బీసీకి అయినా వైస్ ఛాన్సలర్ పదవి ఇచ్చారా? అధికారంలో ఉన్నప్పుడు బీసీల భూములు కొట్టేశారు, వారిని నరికి చంపారు. ఇప్పుడు వారిపై ప్రేమ నటిస్తున్నారు" అని తీవ్రంగా విమర్శించారు.

**రాయలసీమకు చేసిందేమీ లేదు**

రాయలసీమ ప్రాజెక్టులకు జగన్ తన ఐదేళ్ల పాలనలో ఖర్చు పెట్టింది కేవలం రూ. 2,000 కోట్లు మాత్రమేనని, కానీ కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ. 13,500 కోట్లు ఖర్చు చేసి, మరో రూ. 10,000 కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. "సొంత జిల్లా కడపలో స్టీల్ ప్లాంట్‌కు రెండుసార్లు కొబ్బరికాయ కొట్టారు కానీ ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పోలవరం పనులను జగన్ అటకెక్కించారు. మేము అధికారంలోకి వచ్చాక పనులు పూర్తిచేసి సెప్టెంబర్ 3 నాటికి ఉత్తరాంధ్రకు నీళ్లు ఇస్తున్నాం" అని స్పష్టం చేశారు. మద్యం కేసులో అరెస్టులు కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధిస్తోందని జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

# కేటీఆర్‌కు రాఖీ కడతారా, లేదా?.. కవిత రిప్లయ్ ఇదే!

రాఖీ పండుగ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సోదరుడికి రాఖీ కట్టే అవకాశం మరోసారి దక్కకపోవడంపై ఆమె తీవ్ర ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆడబిడ్డగా తన ఆత్మగౌరవం దెబ్బతిన్నదని వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాఖీ పండుగ ప్రస్తావన రాగా కవిత భావోద్వేగానికి గురయ్యారు. "ఈసారి కేటీఆర్‌కు రాఖీ కడతారా?" అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ, "పోయినసారి అడిగితే ఆయన ఊర్లో లేకుండా పారిపోయారు. ఈసారి అడగకుండానే ఏకంగా విదేశాలకు వెళ్లిపోయారు. ఆడబిడ్డలమైన మాకు కూడా ఆత్మగౌరవం ఉంటుంది కదా? మా ఆత్మగౌరవం చాలా తీవ్రంగా దెబ్బతింది" అని ఆవేదనతో అన్నారు. రాఖీ అంటే రక్త సంబంధమని, దాన్ని రాజకీయాలతో ముడిపెట్టకూడదని ఆమె హితవు పలికారు. రాఖీ విషయంలో తన అసంతృప్తిని వెళ్లగక్కడంతోనే కవిత ఆగలేదు. బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు, బీజేపీ-ఆర్ఎస్ఎస్ మద్దతుతో బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇందుకోసం మెదక్‌లో రహస్య సమావేశాలు కూడా నిర్వహించారని అన్నారు. "నా సోదరుడు కేటీఆర్ చాలా అమాయకుడు, అందుకే నన్ను ఒక పథకం ప్రకారం పార్టీ నుంచి బయటకు పంపించారు" అని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్‌లో ప్రస్తుతం తీవ్ర అంతర్గత సంక్షోభం నడుస్తోందని, అందుకే ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. పార్టీలో నెలకొన్న ఈ సంక్షోభం కారణంగానే ప్రజల పక్షాన నిలబడటంలో విఫలమవుతున్నారని అన్నారు. ప్రజలు ఈ విషయాలను గమనించి, తమలాంటి వారిని ఆశీర్వదించాలని కోరారు.

# ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు పత్రాలిస్తే కఠిన చర్యలని హెచ్చరిక

తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, నకిలీ పత్రాలను సమర్పించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఓటర్లు సమర్పించే పత్రాలను, డిక్లరేషన్లను అధికారులు స్వతంత్రంగా ధ్రువీకరిస్తారని సీఈఓ కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించడం భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 217 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. అదేవిధంగా, ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 31 ప్రకారం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 2 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. మొత్తం మీద 92.8 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందజేయనున్నారు. వీరిలో 60.5 లక్షల మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉండగా, మరో 32.3 లక్షల మంది వివరాలు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని అధికారులు గుర్తించారు. విచారణ సమయంలో ఓటర్లు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ వివరాల స్థితిని ఆన్‌లైన్‌లో మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఎపిక్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా స్వయంగా ధ్రువీకరించుకోవచ్చని వెల్లడించారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## అవకాశాలు అందిపుచ్చుకోలేని జెన్‌కో




తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే విద్యుదుత్పత్తి, అనుబంధ రంగాలకు విస్తరించి బలోపేతం కావల్సిన టీజీ జెన్‌కో అందుకు భిన్నంగా అపసవ్య దిశలో పయనిస్తున్నది. సంప్రదాయిక థర్మల్, హైడల్ విద్యుత్తు ఉత్పత్తి రంగాలకు తోడుగా శిలాజేతర పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి దిశగా ఎలాంటి అడుగులూ ముందుకు పడడం లేదు. 2030 నాటికి భారత్ 500 గిగావాట్ల శిలాజేతర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ, కేంద్ర ప్రాధికార సంస్థ బ్యాటరీ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం, ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ జెన్‌కో తన వ్యాపార నమూనాను మార్చుకోవాల్సిన అవసరం ఉంది.డిమాండ్ లేని సమయాల్లో చౌకగా లభించే కరెంటును ఉపయోగించుకొని పీక్ డిమాండ్ వేళల్లో ఉత్పత్తి చేసుకునే లాభసాటి వ్యవహారంగా ఉన్న బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లు నెలకొల్పి విద్యుదుత్పత్తిలో స్వయంసమృద్ధిని సాధించే అవకాశాలు అందిపుచ్చుకోకపోవడం విచారించదగిన విషయం. ఓ పక్క థర్మల్ విద్యుత్ కేంద్రాలు నాణ్యమైన బొగ్గులేక, బొగ్గు కొరత తదితర సమస్యలతో సామర్థ్యం మేరకు విద్యుత్తును ఉత్పత్తి చేయడంలో వెనుకబడిపోతున్నాయి. దీనికితోడు నాలుగువేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మాణం పూర్తిచేసుకున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కోల్, యాష్ హ్యాండ్లింగు ప్లాంట్లను ప్రైవేట్‌పరం చేస్తూ ఇటీవల టెండర్లను పిలవడాన్ని నిరసిస్తూ ఉద్యోగ సంఘాలు ఆందోళనబాట పట్టాయి. నాణ్యమైన బొగ్గును సేకరించి ప్లాంటుకు అందించడంలో విఫలమైన యాజమాన్యం భవిష్యత్తులో పాక్షిక, పూర్తి ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయవచ్చునని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సింగరేణికి బకాయిలు చెల్లించి, నాణ్యమైన బొగ్గును అందుబాటులో ఉంచి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటును పూర్తిస్థాయిలో జెన్‌కో ఆధ్వర్యంలో నడిపేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. యాదాద్రి థర్మల్ ప్లాంట్ బాయిలర్లకు జీ5 నుంచి జీ9 గ్రేడ్ బొగ్గు కావల్సివుండగా జీ15 నుంచి జీ17 గ్రేడ్ నాసిరకం బొగ్గుతో నడపడం వల్ల 800 మెగావాట్ల సామర్థ్యమున్న ఒక్కో యూనిట్ నుంచి 600 మెగావాట్లకు మించి ఉత్పత్తి రావడం లేదనే ఆరోపణలున్నాయి. ఒకవైపు సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా విద్యుదుత్పత్తి రంగంలోకి కూడా ప్రవేశించి, థర్మల్ విద్యుత్తు, సోలార్ రంగాల్లో భారీ పెట్టుబడులు పెడుతూ తమ సంస్థను బలోపేతం చేసుకుంటున్నది. అదే సమయంలో టీజీ జెన్‌కో ఎలాంటి కృషి చేయకపోగా, ప్రైవేట్ ఉత్పత్తి సంస్థలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకుంటున్నది. తెలంగాణ అవసరాలకు విద్యుదుత్పత్తి చేసే ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగాలా? లేక క్రమంగా ప్రైవేటు విద్యుత్ కొనుగోలు చేసే సంస్థగా పరిమితమవ్వాలా? అనే ప్రశ్నకు జెన్‌కో ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.ఇటీవల జరిగిన మణుగూరు డిప్‌సైడ్ బ్లాక్ వేలం నుంచి టీజీ జెన్‌కో అర్ధాంతరంగా తప్పుకోవడంతో సదరు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారు. ఈ బ్లాక్‌ను వదులుకోవడం టీజీ జెన్‌కో చేసిన భారీ తప్పిదం. సుమారు ఎనిమిది వేల మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన టీజీ జెన్‌కోకు ఏడాదికి సుమారు 25 నుంచి 30 మిలియన్ టన్నుల బొగ్గు అవసరముంటుంది. తన బొగ్గు నిల్వలను ఆధారం చేసుకొని విద్యుదుత్పత్తి రంగంలో పెద్ద ఎత్తున సింగరేణి సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తుండగా ప్రధానమైన ముడిసరుకు అయిన బొగ్గు ఉత్పత్తి రంగంలోకి టీజీ జెన్‌కో ప్రవేశించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రస్తుతం విద్యుదుత్పత్తికే పరిమితం కాకుండా భవిష్యత్తులో జెన్‌కో-- గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, కార్బన్ క్రెడిట్స్, రెన్యూవబుల్ ఎనర్జీ సర్టిఫికేషన్, గ్రిడ్ బ్యాలెన్సింగ్ లాంటి రంగాల్లోకి అడుగుపెట్టాల్సిన అవసరముంది. ఇబ్బడిముబ్బడిగా పునరుత్పాదక విద్యుదుత్పత్తిలో పెట్టుబడులు ప్రవహిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో పీక్ డిమాండును తట్టుకొని గ్రిడ్ సామర్థ్యంలో సమతుల్యత సాధించడానికి థర్మల్ ఉత్పత్తికి ప్రత్యామ్నాయంగా సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉంది. 1500 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ కొనుగోలు ఒప్పందాలు ఇటీవల సారస్ ఇన్‌ఫ్రా, కోల్ ఇండియా లిమిటెడ్‌లతో జరిగాయి. అంతేకాకుండా మరొక ప్రైవేట్ కంపెనీతో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ కొనుగోలు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఇందుకుగాను కొనుగోలు యూనిట్ ధర మార్కెట్ ధరల కంటే ఎక్కువగా ఉన్నట్లు అభ్యంతరాలు ఉన్నాయి.

# రాఖీ.. మారిన కాలం, మారని బంధం

-అప్పట్లో అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీక..
-ఇప్పుడు దూరాలను దాటుతున్న డిజిటల్ ప్రేమ
-రక్షణ కంటే ఆత్మీయత, హామీ కంటే అనుబంధమే అసలైన రక్షాబంధన్

అమరావతి,ఆగస్టు 27 వార్త సాక్ష్యం .

ఒక చిన్న దారం.. అందులో మాత్రం జీవితాంతం నిలిచిపోయేంత పెద్ద అనుబంధం. చేతికి కట్టేది రాఖీ అయినా.. మనసులను కలిపేది మాత్రం అన్నాచెల్లెళ్ల ప్రేమ. ప్రతి ఏడాది శ్రావణ పౌర్ణమి సందర్భంగా జరుపుకునే రక్షాబంధన్ కేవలం ఒక పండుగ కాదు.. కుటుంబ బంధాలను గుర్తుచేసే ఆత్మీయ వేడుక. సోదరి తన సోదరుడి మణికట్టుకు రక్షాసూత్రం కట్టి అతని క్షేమాన్ని కోరడం, సోదరుడు ఆమెకు అండగా ఉంటానని భరోసా ఇవ్వడం ఈ పండుగలోని ప్రధాన భావం.

**-అప్పట్లో.. పండుగంటే పల్లెకు పండుగే**

ఒకప్పుడు రక్షాబంధన్ అంటే ఇంటిల్లిపాదీ కలిసి జరుపుకునే పండుగ. పెళ్లయిన ఆడపిల్ల పుట్టింటికి రావడం కోసం అన్నదమ్ములు ఎదురుచూసేవారు. దూరప్రాంతంలో ఉన్న సోదరి కోసం కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా ప్రయాణ ఏర్పాట్లు చేసేవారు. పల్లెటూళ్లలో అయితే రాఖీ పండుగకు మరింత ప్రత్యేకత ఉండేది. చేతితో తయారు చేసిన రాఖీలు, ఇంట్లో చేసిన పిండివంటలు, స్వీట్లు, పసుపు, కుంకుమలతో సాదాసీదాగా వేడుక జరిగేది.
అప్పటి రోజుల్లో సోదరి--సోదరుడి మధ్య సంబంధం కేవలం పండుగ రోజుతో పరిమితం కాలేదు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉండటం కుటుంబ జీవనంలో సహజమైన భాగం. ఒకే ఇంట్లో పెరిగిన బాల్య జ్ఞాపకాలు, చిన్నచిన్న గొడవలు, మళ్లీ కలిసిపోయే ఆప్యాయత.. ఇవన్నీ రాఖీ రోజున మరింత మధురంగా గుర్తుకొచ్చేవి. డిజిటల్ కమ్యూనికేషన్ లేని కాలంలో ఒక ఉత్తరం, ఒక ఫోన్‌కాల్ కోసం ఎదురుచూడటంలోనూ ఒక ప్రత్యేకమైన అనుభూతి ఉండేది.

**-ఇప్పుడు.. దూరమైనా దగ్గరైన బంధం**

కాలం మారింది. ఉద్యోగాలు, చదువులు, వ్యాపారాల కోసం అన్నాచెల్లెళ్లు వేర్వేరు నగరాల్లో, దేశాల్లో స్థిరపడుతున్నారు. ఒకే ఇంట్లో కలిసి కూర్చొని రాఖీ కట్టుకునే అవకాశం చాలామందికి లేకపోయినా.. సాంకేతికత ఆ దూరాన్ని కొంతవరకు తగ్గిస్తోంది. వీడియో కాల్స్, ఆన్‌లైన్ గిఫ్టులు, కొరియర్ ద్వారా రాఖీలు పంపించుకోవడం ఇప్పుడు సాధారణమైంది.



ఒకప్పుడు రాఖీ కోసం సోదరి ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు ఒక క్లిక్‌తో రాఖీ ఇంటి వద్దకే చేరుతోంది. సోదరుడు మరో దేశంలో ఉన్నా వీడియో కాల్‌లో రాఖీ వేడుకను చూసే అవకాశం ఉంది. భౌతిక దూరం పెరిగినా.. భావోద్వేగ అనుబంధాన్ని కొనసాగించేందుకు ఆధునిక సాంకేతికత కొత్త మార్గాలను చూపుతోంది.

**-రాఖీలోనూ మారుతున్న ట్రెండ్**

కాలానుగుణంగా రాఖీల రూపం కూడా మారుతోంది. సంప్రదాయ దారాలతో పాటు వెండి రాఖీలు, వ్యక్తిగత పేర్లతో రూపొందించే రాఖీలు, ప్రత్యేక సందేశాలతో కూడిన బ్యాండ్లు, పర్యావరణహిత రాఖీలకు ఆదరణ పెరుగుతోంది. సోదరుడి అభిరుచికి తగ్గట్టుగా ప్రత్యేకంగా తయారు చేయించిన రాఖీలను పంపించడం కొత్త తరహా ఆప్యాయతగా మారింది. అయితే రాఖీ రూపం మారినా దాని వెనుక ఉన్న భావం మాత్రం మారలేదు. గతంలో సోదరుడు సోదరికి రక్షణ కల్పిస్తాననే మాట ఇచ్చేవాడు. నేడు ఆ భావన మరింత విస్తరించింది. సోదరి విజయాన్ని ప్రోత్సహించడం, ఆమె నిర్ణయాలను గౌరవించడం, కష్టాల్లో అండగా నిలవడం, భావోద్వేగంగా తోడుండటం కూడా 'రక్షణ'లో భాగంగానే మారింది.

**-రక్షణ అంటే కేవలం కాపాడటం కాదు**

నేటి తరం రక్షాబంధన్‌కు కొత్త అర్థాన్ని ఇస్తోంది. సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టడం మాత్రమే కాదు.. ఇద్దరూ ఒకరి జీవితంలో మరొకరు అండగా నిలబడే సంకల్పాన్ని వ్యక్తం చేస్తున్నారు. చిన్ననాటి గొడవలు, దూరాలు, అభిప్రాయ భేదాలు పక్కన పెట్టి మరోసారి ఆత్మీయంగా కలిసే రోజుగా రాఖీ మారుతోంది. కుటుంబ బంధాల్లో సంభాషణ, పరస్పర గౌరవం, క్షమించడం, కష్టాల్లో సహాయం చేయడం వంటి విలువలు బలపడాలని నేటి తరం కోరుకుంటోంది.

**-దారం చిన్నదే.. బంధం పెద్దది**

పండుగలు మారుతున్నాయి.. జీవన విధానాలు మారుతున్నాయి.. కుటుంబాలు విస్తరిస్తున్నాయి.. మనుషుల మధ్య భౌతిక దూరాలు పెరుగుతున్నాయి. కానీ రాఖీ మాత్రం అన్నాచెల్లెళ్ల మధ్య భావోద్వేగ దూరాన్ని తగ్గించే ఒక చిన్న వంతెనలా నిలుస్తోంది. అప్పట్లో ఇంటి ముంగిట కూర్చొని కట్టిన రాఖీ అయినా.. ఇప్పుడు వేల కిలోమీటర్ల దూరం నుంచి వీడియో కాల్‌లో చూపిస్తూ కట్టిన రాఖీ అయినా.. దాని విలువ ప్రేమలోనే ఉంది. రక్షాబంధన్ చెబుతున్న సందేశం ఒక్కటే---కాలం మారొచ్చు.. జీవనశైలి మారొచ్చు.. కానీ నిజమైన అన్నాచెల్లెళ్ల బంధానికి కాలం ఎప్పటికీ అడ్డు కాదు.

# 500 గ్రామాలు- సంస్కృత బాటలోకి!

-సామాన్యులకు చేరువ చేయడమే లక్ష్యం.. గుంటూరు నుంచి సంస్కృత సప్తాహానికి శ్రీకారం
-రాజధానిలో రూ.500 కోట్లతో సంస్కృత విశ్వవిద్యాలయానికి ప్రతిపాదనలు

గుంటూరు,ఆగస్టు 27 వార్త సాక్ష్యం

సంస్కృత భాషను పండితుల భాష అనే అపోహ నుంచి బయటకు తీసుకొచ్చి సామాన్య ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ కార్యాచరణ చేపట్టిందని అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ (శరత్‌చంద్ర) తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 500 గ్రామాలను సంస్కృత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభించామని వెల్లడించారు. గుంటూరులోని శారదా నికేతన్ ఓరియంటల్ కళాశాలలో కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం సౌజన్యంతో గురువారం నిర్వహించిన సంస్కృత సప్తాహం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

**-గుంటూరు వేదికగా సంస్కృత సప్తాహం**

శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సంస్కృత సప్తాహం కార్యక్రమాల్లో భాగంగా గుంటూరులో జరిగిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 'అందరికీ సంస్కృతం--అందరిలోకి సంస్కృతం' అనే నినాదంతో భాషను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించినట్లు శరత్‌చంద్ర తెలిపారు. సంస్కృతం అమృత భాష అని, దానిని కేవలం పండితులకే పరిమితం చేయకుండా ప్రతి కుటుంబంలోనూ వినిపించేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంస్కృత భాషలో ఉన్న అపారమైన జ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, యువతలో భాషపై ఆసక్తి పెంచేందుకు కొత్త ఆలోచనలతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**-రాజధానిలో రూ.500 కోట్లతో విశ్వవిద్యాలయం**

రాజధాని ప్రాంతంలో రూ.500 కోట్లతో కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని శరత్‌చంద్ర తెలిపారు. విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 100 పడకల ఆయుర్వేద ఆసుపత్రి ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. విశ్వవిద్యాలయం ఏర్పాటుతో సంస్కృత అధ్యయనం, పరిశోధనలకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు రాష్ట్రంలో సంస్కృత భాషాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.పుస్తకాల ముద్రణ, ప్రచురణకు సంబంధించిన సదుపాయాలు కూడా అందుబాటులోకి వస్తే సంస్కృత సాహిత్యాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు.

**-జిల్లాల్లో వారంరోజుల కార్యక్రమాలు**

సంస్కృత సప్తాహంలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆగస్టు 25న శ్రీకాకుళం, విజయనగరంలో, 26న విశాఖపట్నం, కొవ్వూరులో, 27న తణుకు, గుంటూరులో కార్యక్రమాలు నిర్వహించారు. 28న జిల్లెళ్లమూడి, నెల్లూరులో, 29న తిరుపతి, కడపలో, 30న అనంతపురం, కర్నూలులో, 31న గుడివాడ, విజయవాడలో కార్యక్రమాలు జరగనున్నాయి. విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో సంస్కృత సప్తాహం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.
విద్యార్థులకు భారతం, భాగవతం తదితర అంశాలపై క్విజ్ కార్యక్రమాలతో పాటు సంస్కృత భాషపై ఆసక్తి పెంచే పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంస్కృత భాష అభివృద్ధికి విశేష కృషి చేసిన పండితులను సత్కరిస్తున్నారు.

**-గుంటూరు వేదికగా భాషా చైతన్యం**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి సభాధ్యక్షత వహించారు. శ్రావణ పౌర్ణమిని సంస్కృత దినోత్సవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. గుంటూరులోని శారదా నికేతన్ చారిత్రక ప్రాధాన్యతను కూడా ఆయన గుర్తుచేశారు. మహాత్మాగాంధీ ఇక్కడికి విచ్చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఇది గుంటూరు జిల్లాకు గర్వకారణమన్నారు.
మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సంస్కృతాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సంస్కృతం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడితే మరింత మంది భాషను నేర్చుకునేందుకు ముందుకు వస్తారని సూచించారు. భాషలోని జ్ఞాన సంపదను యువతకు పరిచయం చేసి వారిలో ఆసక్తి పెంచాలని అన్నారు.

**-ఇంటి నుంచే సంస్కృతం మొదలు కావాలి**



ఉత్సవ ప్రముఖులు డా. దీవి నరసింహ దీక్షిత్ మాట్లాడుతూ సంస్కృతం సరళమైన భాషేనని ప్రజలకు తెలియజేయడానికే ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. ఇంటి ఇల్లాలు సంస్కృతంలో మాట్లాడటం ప్రారంభిస్తే కుటుంబమంతా ఆ భాషను అలవర్చుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంస్కృత సప్తాహం ఒక గొప్ప భాషా చైతన్య యాత్రగా అభివర్ణించారు.
సంస్కృత విద్యార్థిని పి. శ్రీవాణి భాష వైశిష్ట్యాన్ని వివరించారు. సంస్కృత పండితులు డా. పి.టి.జి. రంగాచార్య మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంస్కారాలకు సంస్కృత భాష గొప్ప వారధి అన్నారు. భాషను సమష్టిగా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

**-పండితులకు ఘన సత్కారం**

కార్యక్రమంలో సంస్కృత పండితులు డా. శ్రిష్టి లక్ష్మీకుమార శర్మ, డా. ఆకెళ్ల మల్లు సోమయాజులు, సుఖవాసి మల్లికార్జునరాయ శాస్త్రి, కూనిశెట్టి స్వరాజ్యలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఉపసంచాలకులు డా. పి. కోటిరత్నం, శారదా నికేతన్ ఓరియంటల్ కళాశాల కార్యనిర్వహణాధికారి టి. శ్రీనివాస్, ప్రధాన ఉపాధ్యాయులు ఆరిఫ్ బేగ్, నిర్వాహకులు డా. మరుధూరి నరసింహాచార్య, డా. పి. దేవేంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు. గుంటూరు జిల్లాలో జరిగిన ఈ కార్యక్రమం సంస్కృత భాషను ప్రజల దైనందిన జీవితానికి చేరువ చేయాలనే ప్రయత్నానికి వేదికగా నిలిచింది. 500 గ్రామాలను సంస్కృత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యం కార్యరూపం దాల్చితే పాఠశాలలు, కుటుంబాలు, గ్రామస్థాయిలో సంస్కృత భాషపై కొత్త చైతన్యం ఏర్పడే అవకాశం ఉంది.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# గులాంగిరి పై పూలే పోరాటం

-గులాంగిరి పుస్తకాన్ని బహుకరించిన మిత్రుడు లెక్చరర్ యేసయ్య
-మహాత్మా జ్యోతిబాపూలే రచనలు సామాజిక మార్పుకు దిక్సూచి
-మహిళల విద్యాకై అహర్నిశలు పోరాటం చేసిన మహనీయుడు

మార్కాపురం ఆగస్టు 27 వార్త సాక్ష్యం

మహాత్మా జ్యోతిరావు పూలే రచించిన గులాంగిరి పుస్తకాన్ని మిత్రుడు, లెక్చరర్ యేసయ్య బహుకరించారు. ఈ సందర్భంగా పూలే రచనలు, ఆయన సామాజిక సంస్కరణ ఉద్యమాలపై చర్చించారు. 1873లో జ్యోతిరావు పూలే రచించిన గులాంగిరి కుల వివక్ష, సామాజిక అసమానతలు, అణచివేతపై తీవ్రంగా ప్రశ్నించిన ప్రముఖ రచనగా నిలిచింది. ఈ పుస్తకం ద్వారా కుల వ్యవస్థలోని అన్యాయాలను విశ్లేషిస్తూ సమానత్వం, స్వేచ్ఛ, మానవ గౌరవం కోసం పూలే తన ఆలోచనలను ముందుకు తెచ్చారు. పూలే కేవలం రచయితగానే కాకుండా విద్య, మహిళా సాధికారత, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన సామాజిక సంస్కర్తగా గుర్తింపు పొందారు. ఆయన తృతీయ రత్న, బ్రాహ్మణాంచే కసబ్, గులాంగిరి, శేత్కర్యాచా ఆసూడ్, సత్సార్, సార్వజనిక సత్యధర్మ పుస్తక్ వంటి రచనలు సమాజంలోని అసమానతలను ప్రశ్నించాయి. ముఖ్యంగా శేత్కర్యాచా ఆసూడ్లో రైతుల దుస్థితి, దోపిడీపై ఆయన విశ్లేషణ చేశారు. విద్యే విముక్తికి మార్గం అనే భావనతో పూలే, సావిత్రిబాయి పూలేలు మహిళలు మరియు అణగారిన వర్గాలకు విద్య అందించేందుకు కృషి చేశారు. 1873లో పూలే సత్యశోధక సమాజాన్ని స్థాపించి సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కులు, మహిళల అభ్యున్నతి కోసం ఉద్యమాన్ని విస్తరించారు. ఈ సందర్భంగా లెక్చరర్ యేసయ్య మాట్లాడుతూ, "పూలే రచనలు కేవలం చరిత్రను తెలుసుకోవడానికి మాత్రమే కాకుండా నేటి సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆలోచించడానికి మార్గదర్శకాలు. యువత మహాత్మా పూలే, సావిత్రిబాయి పూలే రచనలు చదివి వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి" అని అన్నారు. పూలే రచనలను చదవడం ద్వారా కుల వివక్ష, సామాజిక అసమానతలు, మహిళలపై వివక్ష, రైతుల సమస్యలు వంటి అంశాలపై చారిత్రక అవగాహన పెరుగు తుందని, సమానత్వ సమాజ నిర్మాణానికి ఆ ఆలోచనలు ఇప్పటికీ ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. గులాంగిరి వంటి రచనలు సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాట చరిత్రను కొత్త తరాలకు పరిచయం చేస్తాయని యువత విద్యార్థులు మహనీయుల రచనలు చదవాలని న్యాయవాది కోడి మోహన్ రావు తెలిపారు


గులాంగిరి పుస్తకాన్ని బహుకరిస్తున్న లెక్షలర్ యేసయ్య

## ఆత్మకూరు వన్యప్రాణి అటవీ డివిజన్లో- నాటు తుపాకులు ఉచ్చులు స్వాధీనం




-అడవిలోకి ప్రవేశించి వన్య ప్రాణులను వేటాడిన చంపిన కఠినమైన చట్టాలు తప్పవు
-50 కి పైగా ఉచ్చులు నాటు తుపాకి స్వాధీనం
-నల్లకలువ గ్రామానికి చెందిన వేటగాళ్లుగా గుర్తింపు
-ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావో

ఆత్మకూరు ఆగస్టు 27 వార్త సాక్ష్యం

శ్రీశైలం- నాగార్జునసాగర్ పెద్ద పులుల అభయారణ్యంలో ఈనెల 26వ తేదీన వన్యప్రాణి వేటగాళ్ల దగ్గర నుంచి 50 కి పైగా ఉచ్చులు ఒక నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నట్లు ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావో గురువారం మీడియాకు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు వన్యప్రాణి అటవీ డివిజన్ పరిధిలోని నల్ల కాలువ గ్రామానికి చెందిన ఇద్దరు వేటగాళ్లు అడవిలో అక్రమంగా ప్రవేశించి వేటను ప్రారంభించిన విషయాన్ని వెంటనే అటవీశాఖ అధికారుల దృష్టికి రాగా సిబ్బందితో అప్రమత్తమై వేటగాడి వద్ద నుంచి 50 కి పైగా ఉచ్చులు నాటు తుపాకి స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టడం జరిగిందని అన్నారు మరికొందరిపై నిఘా ఉంచి త్వరలోనే వన్యప్రాణి వేటగాళ్లను పట్టుకునే విధంగా అటవీ శాఖ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టిందని అన్నారు అడవిలోకి అక్రమంగా ప్రవేశించి వన్యప్రాణులను వేటాడినా చంపిన అటవీ హక్కుల చట్టం కింద కఠినమైన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు అడవికి సమీపంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు వన్య ప్రాణుల సంరక్షణకు సహకరించాలని ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావో మీడియా ద్వారా ప్రజలకు తెలియజేశారు.



## విద్యా అభివృద్ధే లక్ష్యంగా ఆర్ఎస్ఎఫ్ ప్రథమ రాష్ట్ర మహాసభలు

-విద్యా సంస్కరణల కోసం ఉద్యమానికి శ్రీకారం
-ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల కరపత్రాలు ఆవిష్కరించిన
-నంద్యాల జిల్లా ఆర్ఐఓ శంకర్ నాయక్
-విద్యారంగా అభివృద్ధి విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటం
-నంద్యాల జిల్లా ఆర్ఎస్ఎఫ్ అధ్యక్షుడు వేటూరి రంగస్వామి

నంద్యాల ఆగస్టు 27 వార్త సాక్ష్యం

విద్యా రంగ అభివృద్ధి, విద్యార్థుల సమస్యల పరిష్కారం, సమాన విద్యా అవకాశాల సాధనకై, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్ (RSF) ప్రథమ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 2, 3, 4 తేదీల్లో కడప వేదికగా నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వేటూరి రంగస్వామి అన్నారు గురువారం నంద్యాల పట్టణంలోని ఆర్ ఐ ఓ కార్యాలయం దగ్గర కరపత్రాల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భ ంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, విద్యా రంగంలో సామాజిక న్యాయం సాధించడానికి ఆర్ఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతో ందన్నారు. విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం సంఘటిత ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆర్ఎస్ఎఫ్ ప్రథమ రాష్ట్ర మహాసభలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహాసభను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయడం ద్వారా విద్యార్థుల హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయ సాధనకు మరింత బలమైన ఉద్యమాన్ని నిర్మిద్దామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నాయకులు మాధవ్, మహేంద్ర, నవీన్, చైతన్య ,పండు, వెంకటేష్, మనీ తదితరులు పాల్గొన్నారు




## వాహనదారులు నిబంధనలు పాటించాలి ఎస్సై రవీంద్ర

కర్లపాలెంఆగస్టు 27 వార్త సాక్ష్యం

వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కర్లపాలెం ఎస్ఐ ఎస్. రవీంద్ర సూచించారు. గురువారం జాతీయ రహదారి 216పై భారత్ బంక్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలు, హెల్మెట్ ధారణ తదితర అంశాలను పరిశీలించారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ రవీంద్ర పేర్కొన్నారు.



## భక్తిశ్రద్ధలతో శ్రీరామాలయ ప్రతిష్ఠ

-ఆలయ ప్రతిష్ట లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోన



పిట్టలవానిపాలెంఆగస్టు 27 వార్త సాక్ష్యం

పిట్టలవానిపాలెం మండల పరిధిలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీ శివారులో గల గౌడపాలెం గ్రామంలో శ్రీరామాలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్యక్రమానికి బాపట్ల మాజీ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరై శ్రీరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరైన భక్తులు, గ్రామస్థులతో కోన రఘుపతి ఆత్మీయంగా ముచ్చటించారు. శ్రీరామాలయ నిర్మాణం, ప్రతిష్ఠ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులను అభినందించారు. ఈ మహోత్సవంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## వేమూరులో భారీ జాబ్ మేళా

వేమూరుఆగస్టు 27 వార్త సాక్ష్యం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నక్క ఆనంద్ బాబు సహకారంతో ఈ నెల 31వ తేదీన వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి ఎం. మాధవి తెలిపారు. జాబ్ మేళాలో 18 కంపెనీలు పాల్గొంటుండగా, 600కు పైగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. అభ్యర్థుల విద్యార్హతలను బట్టి నెలకు సుమారు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం లభించే అవకాశముందని తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ, పీజీ తదితర విద్యార్హతలు కలిగి, 18 నుంచి 35 సంవత్సరాల వయసున్న నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా లేదా రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు ముందుగా naipunyam.ap.gov.in వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 9988853335తో పాటు 7207218883, 9949326722, 9932384374, 9640695229 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## సైనిక్ కార్యాలయం ఏర్పాటు చారిత్రాత్మకం



బాపట్ల ఆగస్టు 27 వార్త సాక్ష్యం

బాపట్ల పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ భీమవారిపాలెం రోడ్డులో జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం అధికారికంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కెప్టెన్ సత్య ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. సీనియర్ మాజీ సైనికుడు సుంకర శేషగిరిరావు చేత రిబ్బన్ కట్ చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు మాట్లాడుతూ బాపట్లలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం ఏర్పాటు కావడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ సహకారం, సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కెప్టెన్ సత్య ప్రసాద్ ప్రోత్సాహంతో కార్యాలయం ఏర్పాటైందన్నారు.
కెప్టెన్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఇకపై బాపట్ల జిల్లా సైనికులు, మాజీ సైనికులు తమ సమస్యల పరిష్కారం కోసం గుంటూరుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు పొందవచ్చన్నారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు కార్యాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ అధికారి గుణశీల, ఆర్ఎస్బీ అధికారులు, బాపట్ల మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, వివిధ ప్రాంతాల మాజీ సైనిక సంఘాల ప్రతినిధులు, భారీ సంఖ్యలో మాజీ సైనికులు పాల్గొన్నారు. అతిథులను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# పివి పాలెం లో ప్రత్యేక పీజీఆర్ఎస్



బాపట్ల ఆగస్టు 27 వార్త సాక్ష్యం

బాపట్ల నియోజకవర్గంలో భాగంగా పి.వి.పాలెం మండలం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 'ఒక నెల.. ఒక నియోజకవర్గం.. నాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రతి శుక్రవారం ప్రత్యేక పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి బాపట్ల నియోజకవర్గ పరిధిలోని అన్ని శాఖల మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించాలని కోరారు. ఫిర్యాదుల సమాచారం కోసం 1100కు కాల్ చేయవచ్చని, Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

# విద్యార్థులకు సైబర్ నేరాల పై భద్రతా పాఠాలు




చీరాలఆగస్టు 27 వార్త సాక్ష్యం

బాపట్ల జిల్లా చీరాల మండలం కొత్తపేటలోని ఏపీ మోడల్ స్కూల్‌లో చీరాల టూ టౌన్ పోలీసులు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చీరాల టూ టౌన్ సీఐ ఏ. శశికుమార్, ఎస్ఐ కె.పి. రవీందర్, చీరాల సబ్‌డివిజన్ శక్తి టీం సభ్యురాలు సీహెచ్. సునీత, పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. ఆంజనేయులు, సిబ్బంది, సుమారు 250 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ శశికుమార్ సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాల్సిన అవసరంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి నడవడికను అలవర్చుకోవాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు.మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడితే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు హెల్మెట్లు బహుమతిగా అందించి, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న నేరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. కార్యక్రమం నిర్వహణకు సహకరించిన పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి పరస్పరం కృతజ్ఞతలు తెలిపారు.

# నిరుపేద వృద్ధురాలికి నిత్యావసర సాయం

కర్లపాలెంఆగస్టు 27 వార్త సాక్ష్యం



కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎం.వి.రాజుపాలెంలో నిరుపేద కుటుం బానికి రెడ్డి సేవా మిత్ర ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సెక్రటరీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందిం చడంతో పాటు గ్రామాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యలో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహిస్తూ బహుమతులు అందిస్తున్నామని పేర్కొన్నారు. కర్లపాలెం మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా మిత్ర కోశాధికారి అట్ల హరిబాబురెడ్డి, అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి, పయనం శ్రీనివాసరెడ్డి, అట్ల శ్రీనివాస్‌రెడ్డి, అట్ల రాయుడు, పిట్టు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు తితిదే ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం






-రక్షాబంధన్ బ్యానర్ ఆవిష్కరణ
-డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తి.తి.దే.

నందికొట్కూరు ఆగస్టు 27 వార్త సాక్ష్యం

శ్రావణ పూర్ణిమ సందర్భాన్ని పురస్కరించుకుని కర్నూలు నగరం, గోకులంలోని శ్రీగోదా రంగనాథ స్వామి దేవస్థానం నందు, నంద్యాల జిల్లా మిడుతూరు మండలం, సుంకేసుల గ్రామంలోని శ్రీ ఇష్టార్థ రామాలయం నందు రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్యానర్ ను గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్తా, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, తుమ్మేపల్లి శ్రీనివాసరావు గోకులం బృందంతో కలిసి ఆవిష్కరించారు. నేడు సాయంత్రం 6 గంటలకు గోకులంనందు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డిచే ఉపన్యాసము మరియు కుంకుమార్చన కార్యక్రమం, సుంకేసుల గ్రామం నందు జూలకంటి మల్లికార్జున రావుచే రక్షాబంధన్ సందేశం ఉంటుందని ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళ బాల సుధాకర్, పాలాది సుబ్రహ్మణ్యం, పాలాది వెంకట సుబ్రమణ్యం, భూమా కృష్ణ మోహన్, ఇటిక్యాల పుల్లయ్య, బైసాని సుబ్రహ్మణ్యం, మాజీ కార్పోరేటర్ లింగం రవికుమార్, లింగం కృష్ణయ్య, తల్లం సురేశ్, పడుచూరు ఇందుమతి, ఆర్వేటి స్వర్ణలత, హేమరుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నివారణ పట్ల ప్రజలు అవగాహన కల్పించుకోవడంలో ముందుండాలి





-మేరీబా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం

ఆత్మకూరు ఆగస్టు 27 వార్త సాక్ష్యం

పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ పాత బస్టాండ్ ఆవరణంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు మేరీబా స్వచ్ఛంద సేవ సంస్థ మేనేజర్ జూలీ ఫికర్ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మకూరు గవర్నమెంట్ హాస్పిటల్ నందు ఎల్ఈడి ద్వారా ప్రజలకు హెచ్ఐవి ఎయిడ్స్ పైన అవగాహన కల్పించారు సందర్భంగా హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల సమాజం అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ షౌకత్ అలీ డాక్టర్ జగదీష్ లు అన్నారు అనంతరం ప్రజలు వారి యొక్క హెచ్ఐవి స్థితిని తెలుసుకోవడానికి ఐసిటిసి సెంటర్ ఆత్మకూరు గవర్నమెంట్ హాస్పిటల్ నందు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని ప్రజలకు ఉన్నటువంటి అపోహలను తొలగించడం కొరకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ కూడా ఇవ్వడం జరుగుతుంది అని ప్రసాద్ ఐ సి టి సి కౌన్సిలర్ చెప్పారు ప్రభుత్వ వైద్యశాలలో హెచ్ఐవి సేవలను సద్వినియోగం చేసుకొని హెచ్ఐవి ఎయిడ్స్ లేని సమాజాన్ని రాబోయే కాలంలో మనం చూడాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మేరీబా సిబ్బంది యువరాజు రాజు నరసమ్మ సంజమ్మ తదితరులు పాల్గొన్నారు

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం





-పుట్టినరోజు వేడుకల నుంచి ఇంటికి వస్తుండగా మృత్యువు కబళించింది
-ట్రావెల్స్ బస్సు--ఆటో ఢీ.. ఏడుగురు మృతి
-8 మంది తీవ్రంగా గాయాలు.. నలుగురు చిన్నారులు కూడా
-వేలూరు గ్రామంలో విషాద ఛాయలు

పల్నాడు, ఆగస్టు 27 వార్త సాక్ష్యం:

పుట్టినరోజు వేడుకల్లో ఆనందంగా గడిపి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన వారిని మృత్యువు వెంటాడింది. చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ సమీపంలో ట్రావెల్స్ బస్సు--ఆటో ఢీకొన్న ఘోర ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తమవారిని సురక్షితంగా ఇంటికి తీసుకొస్తారని ఎదురుచూసిన కుటుంబాలకు ఈ ప్రమాదం తీరని విషాదాన్ని మిగిల్చింది. వేలూరు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.పుట్టినరోజు వేడుకల్లో ఆనందంగా పాల్గొని ఇంటి బాట పట్టిన ఆ కుటుంబాలపై తెల్లవారుజామున మృత్యువు విరుచుకుపడింది. మరో కాసేపట్లో స్వగ్రామానికి చేరుకుంటామనుకున్న సమయంలో వేగంగా దూసుకొచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వారి ఆటోను ఢీకొట్టడంతో ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ హృదయ విదారక ఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.

-వేడుకల నుంచి తిరుగు ప్రయాణంలో..

చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన పలువురు ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకలకు వెళ్లారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఆటోలో స్వగ్రామం వేలూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో విజయవాడ నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అడ్డరోడ్డు వద్ద ఆటోను ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి ఆటో తీవ్రంగా ధ్వంసమైంది. ప్రమాద సమయంలో ఆటోలో 15 మంది వరకు ప్రయాణిస్తున్నట్లు పోలీసులు తెలిపినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. నలుగురు ఘటనాస్థలంలోనే మృతి చెందగా, గాయాలతో ఆస్పత్రికి తరలించిన వారిలో మరో ముగ్గురు చికిత్స పొందుతూ మృతి చెందడంతో మృతుల సంఖ్య ఏడుకు చేరింది.

-ఏడుగురు మృత్యువాత..

తాజా సమాచారం ప్రకారం ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నట్లు సమాచారం. వివిధ మీడియా కథనాల్లో పేర్ల విషయంలో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నాయి. ఇప్పటివరకు వెల్లడైన వివరాల ప్రకారం బొంతా బాబురావు, బొంతా మణెమ్మ, బొంతా సంపూర్ణమ్మ, బొంతా గంగమ్మ, బొంతా లక్ష్మమ్మ, బొంతా మరియమ్మ, చౌటుపల్లి స్వార్థమ్మ మృతి చెందినవారిగా గుర్తించారు. మీరు అందించిన ప్రాథమిక జాబితాలో బొంతా మంగమ్మ, బొంతా బాబురావు, బొంతా గంగమ్మ, బొంతా సంపూర్ణమ్మ, బొంతా మరియమ్మ, ఎస్.లక్ష్మమ్మ పేర్లు ఉన్నాయి. అయితే తాజా ప్రచురణల్లో ఏడో మృతురాలి పేరు చౌటుపల్లి స్వార్థమ్మగా పేర్కొనడంతో, అధికారిక పోలీసు/ఆస్పత్రి ధ్రువీకరణ తర్వాత పేర్లను తుది జాబితాగా ప్రచురించడం మంచిది.

-ఆస్పత్రుల్లో క్షతగాత్రులు

ప్రమాదంలో 8 మంది గాయపడినట్లు తాజా పోలీసు ఆధారిత నివేదికలు చెబుతున్నాయి. వీరిలో నలుగురు చిన్నారులు కూడా ఉన్నారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్), చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

-సీఎం దిగ్భ్రాంతి..

మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులకు ఫోన్ చేసి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

-వేలూరులో విషాదం

ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు ఒకే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో వేలూరు గ్రామం విషాదంలో మునిగిపోయింది. పుట్టినరోజు వేడుకలో కలిసి నవ్వుతూ గడిపిన వారు.. ఇంటికి చేరకముందే విగతజీవులుగా మారడం కుటుంబ సభ్యులను కన్నీరుమున్నీరుగా చేసింది. మృతుల ఇళ్ల వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. గాయపడిన వారు క్షేమంగా బయటపడాలని గ్రామస్థులు ప్రార్థిస్తున్నారు.ప్రమాదానికి అసలు కారణం ఏమిటి? అనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బస్సు వేగం,ఆటో ప్రయాణ పరిస్థితులు, డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం తదితర కోణాల్లో విచారణ కొనసాగుతోంది. కొన్ని కథనాల్లో ఆటో డ్రైవర్ మద్యం సేవించినట్లు స్థానికుల ఆరోపణలు ప్రస్తావించబడినప్పటికీ,దీనిని అధికారికంగా నిర్ధారించని అంశంగా మాత్రమే చూడాలి.

# నేపాల్ వరదల్లో 33 దేశాల పర్యాటకులు అదృశ్యం

## ఏయే దేశాల వారు ఎంతమంది అంటే..?

నేపాల్ ఆగస్టు 27 వార్త సాక్ష్యం

నేపాల్ లో భోటేకోషి, త్రిశూలి నదుల్లో సంభవించిన ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఇప్పటివరకు 33 దేశాలకు చెందిన 644 మంది పర్యాటకులు గల్లంతయ్యారని నేపాల్ జాతీయ పర్యాటక బోర్డు వెల్లడించింది. వీరిలో 178 మంది భారతీయులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. సహాయక చర్యలు కొనసాగుతుండగా, ఇప్పటివరకు 177 మృతదేహాలు వెలికితీశారు. నేపాల్‌లో భోటేకోషి, త్రిశూలి నదుల్లో సంభవించిన ఆకస్మిక వరదల్లో ఇప్పటివరకు 644 మంది పర్యాటకులు గల్లంతయ్యారని నేపాల్ జాతీయ పర్యాటక బోర్డు (ఎన్‌టీబీ) తెలిపింది. ఇందులో 517 మంది విదేశీయులు, 127 మంది నేపాలీయులు ఉన్నారు. రసువా, నువాకోట్ జిల్లాల్లోని ఈ వరదల కారణంగా 178 మంది భారతీయ పర్యాటకులు అదృశ్యమయ్యారు. మొత్తం 33 దేశాలకు చెందిన పర్యాటకులు గల్లంతయ్యారని బోర్డు వెల్లడించింది.

**-దేశాల వారీగా గల్లంతైన పర్యాటకుల వివరాలు**

భారత్ -- 178
అమెరికా -- 65
ఉక్రెయిన్ -- 53
మలేషియా -- 51
ఆస్ట్రేలియా -- 35
యూకే -- 33
కెనడా -- 25
నేపాల్ -- 127
సింగపూర్ -- 9
జర్మనీ -- 8,
రష్యా -- 8
లాట్వియా -- 6,
సౌత్ ఆఫ్రికా -- 6
జపాన్ -- 5,



న్యూజిలాండ్ -- 5
ఫ్రాన్స్ -- 4
బెల్జియం -- 3,
స్పెయిన్ -- 3
ఇటలీ -- 2,
ఐర్లాండ్ -- 2,
కజకిస్తాన్ -- 2,
నెదర్లాండ్స్ -- 2,
పోర్చుగల్ -- 2 ,

బెలారస్, బల్గేరియా, ఫిన్లాండ్, హంగేరి, ఇజ్రాయిల్, లిథువేనియా, ఫిలిప్పీన్స్, సెర్బియా, స్వీడన్ తదితర దేశాల నుంచి ఒక్కొక్కరు ఉన్నారు.

**-కొనసాగుతున్న సహాయక చర్యలు**

ఆగస్టు 26న ఉదయం సుమారు 8:30 గంటలకు టిబెట్ వైపు నుంచి ఐస్, రాతి కుప్ప కూలిపోవడంతో భోటేకోషి, త్రిశూలి నదుల్లో భారీ ఫ్లాష్ ఫ్లడ్ సంభవించింది. కైలాస్ మానసరోవర్ యాత్రికులు, గోసైన్‌కుండ తదితర ప్రాంతాలకు వెళ్తున్న పర్యాటకులు ఎక్కువగా ప్రభావితమయ్యారు. ఇప్పటివరకు సుమారు 177 మంది మృతదేహాలు బయటపడ్డాయి. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది..ప్రస్తుతం నేపాల్ సైన్యం, పోలీసులు, టూరిస్ట్ పోలీసులు, స్థానిక అధికారులు సహా బహుళ ఏజెన్సీలు సహాయక చర్యలు చేపట్టాయి. హెలికాప్టర్ల ద్వారా సెర్చ్ ఆపరేషన్, రెస్క్యూ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బాధిత కుటుంబాలు సమాచారం కోసం నేపాల్ టూరిజం బోర్డు హెల్ప్‌లైన్‌లు 1234, 1144, టూరిస్ట్ పోలీస్ నంబర్ 9851289445ను ఏర్పాటు చేశారుభారీగా ఆస్తినష్టం వరదల వల్ల సుమారు 40 కిలోమీటర్ల రహదారులు, వంతెనలు,13 హైడ్రోపవర్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. టిబెట్ వైపు కూడా వందలాది మంది గల్లంతయ్యారని చైనా అధికారులు తెలిపారు. మొత్తం వరదల్లో గల్లంతైన వారి సంఖ్య 1,500 వరకు ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

# చంద్రబాబుతోనే సీమ సస్య శ్యామలం

**-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
**-2 ఏళ్లలో రాయలసీమకు హంద్రీ-నీవా ద్వారా 50 టీఎంసీలు తరలించాం**
**-19 నియోజక వర్గాల్లో 420కు పైగా చెరువులు నింపాం**
**-గతంలో పులివెందులకు సాగునీరిచ్చిన చంద్రబాబు**
**-త్వరలో 24 గంటలూ తాగునీరు కూడా ఇవ్వబోతున్నదీ ఆయనే...**
**- సీమను అభివృద్ధి చేస్తున్నది చంద్రబాబే అని ఒప్పుకున్న వైసీపీ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి**
**-5 ఏళ్లలో రాయలసీమకు జగన్ చేసింది శూన్యం**
**-సీమ ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు**
**-ఆనాడు జగన్ ను వైసీపీ నాయకులు ఎందుకు ప్రశ్నించలేదు**
**-సీమ సాగునీటి ప్రాజెక్టులపై బహిరంగ చర్చ రెడీ...: మంత్రి సవిత**

పెనుకొండ ఆగస్టు 27 వార్త సాక్ష్యం:

రాయలసీమను సీఎం చంద్రబాబునాయుడు సస్యశ్యామలం చేస్తున్నారని, ఆయన హయాంలోనే సీమ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి భారీ ఎత్తున నిధులు కేటాయించారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రెండేళ్లలో హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు 50 టీఎంసీల కృష్ణా జలాలను తరలించామన్నారు. వైసీపీ పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు రూ.2,011 కోట్లే ఖర్చు చేశారని, 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.12,500 వెచ్చించిందని గుర్తుచేశారు. రాయలసీమ ప్రాజెక్టుల గురించి వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. ఆనాడే జగన్ ను వైసీపీ నేతలు ఎందుకు నిలదీయలేదని మంత్రి సవిత ప్రశ్నించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. అన్న ఎన్టీఆర్ తెలుగు గంట, హంద్రీ-నీవా, పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ వంటి ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు. 2014-19 మధ్య రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.12,500 కోట్లు వెచ్చించారన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రూ.6,600 వేల కోట్లకుపైగా ఖర్చు చేశాం న్నారు. ఈ రెండేళ్ల కాలంలో హంద్రీ - నీవా ద్వారా రాయలసీమకు 52 టీఎంసీల నీటిని తీసుకొచ్చా మన్నారు. 19 నియోజక వర్గాల్లో ఉన్న 420 చెరువు లను నీటితో నింపామన్నారు.



తుంగభద్ర (టీబీ) డ్యామ్ ఆధునీకీకరణ, క్రస్ట్ గేట్ల మార్పిడికి రూ.35 కోట్లు వెచ్చించామన్నారు. రూ.750 కోట్ల వ్యయంతో హంద్రీ-నీవా మడకశిర బ్రాంచ్ కెనాల్ వెడల్పు పనులకు ఎమ్మెల్యే బాలకృష్ణ చేతుల మీదుగా శ్రీకారం చుట్టామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంతో ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి సవిత తెలిపారు.

**-పులివెందులకు సాగు,తాగునీరిస్తున్న చంద్రబాబు**

కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకు పాల్పడకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ సాగు, తాగునీరందించడానికి తీవ్రంగా కృషి చేస్తోందని మంత్రి సవిత తెలిపారు. ముఖ్యంగా పులివెందుల నియోజక వర్గానికి 2014-19 మధ్య సీఎం చంద్ర బాబునాయుడు సాగునీరందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, పులివెం దులకు తాగు నీరందించడానికి రూ.480 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో మెగా వాటర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టామన్నారు. వచ్చే నెలలో ఈ నిర్మా ణం పూర్తి కానుందన్నారు. ఈ వాటర్ గ్రిడ్ నిర్మాణ ంతో 24 గంటలూ పులివెందులకు తాగునీరు అందు తుందని తెలిపారు. పులివెందులకు సాగు, తాగు నీరు అందిస్తున్న ఘనత సీఎం చంద్రబా బుదేనని మంత్రి సవిత వెల్లడించారు.

**-జగన్ ను ఎందుకు నిలదీయలేదు..?**

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. తన స్వార్థ రాజకీయాల గురించి తప్ప, సీమ అభివృద్ధి గురించి జగన్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్య రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.12,500 కోట్లు వెచ్చించారన్నారు. తరవాత అధికారంలోకి వచ్చిన అయిదేళ్లలో రాయలసీమ ప్రాజెక్టులకు కేవలం రూ.2,011 కోట్లే ఖర్చు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రూ.6,600 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామన్నారు. ఇదే విషయం వైసీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సైతం ఆ పార్టీ నాయకులకు వెల్లడించారన్నారు. రాయలసీమ అభివృద్ధి గురించి జగన్ ఏనాడూ దృష్టి సారించలేదని ఆయన అన్నారన్నారు. రాయలసీమ పట్ల చూపుతున్న నిర్లక్ష్యం గురించి ఆనాడు జగన్ ను ఎందుకు నిలదీయలేదని వైసీపీ నాయకులను మంత్రి సవిత ప్రశ్నించారు.

**-బహిరంగ చర్చ రెడీ...**

ఎల్ నినో సహా వైసీపీ లేవనెత్తిన సమస్యలపైనా అసెంబ్లీలో చర్చకు రావాలని జగన్ ను ఆహ్వానించినా ముఖం చాటేశారని మంత్రి సవిత మండిపడ్డారు. కావాల్సినంత సమయం మైక్ ఇస్తామని, వైసీపీ హయాంలో లాగా అగౌరపరచమని చెప్పినా అసెంబ్లీకి జగన్ రాలేదన్నారు. ఇప్పుడు ఎక్కడో కూర్చొని అబద్ధాలు మాట్లాడడం జగన్ కే చెల్లిందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులను స్పష్టం చేస్తున్నానని, రాయలసీమ ప్రాజెక్టులపై బహిరంగ చర్చకైనా సిద్ధంగా ఉన్నామని మంత్రి సవిత సవాల్ చేశారు.

## బాధితులకు వైద్య భరోసా



వేమూరు ఆగస్టు 27 వార్త సాక్ష్యం

ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్--ఎల్‌ఓసీ) ద్వారా వేమూరు నియోజకవర్గానికి చెందిన ముగ్గురు అనారోగ్య బాధితులకు రూ. 7,73,839 విలువైన వైద్య సాయం మంజూరైంది. చుండూరు మండలం చినపరిమికి చెందిన బొమ్ము శివ నాగేంద్రమ్మకు రూ.1,43,980, భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన వంగర శ్రీనివాసరావుకు రూ.3,04,159, పల్లికోన గ్రామానికి చెందిన చిలక ప్రేమానందానికి రూ.3,25,700 మంజూరయ్యాయి. ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు రిఫరెన్స్‌తో పంపిన దరఖాస్తులను పరిశీలించిన ప్రభుత్వం అర్హులకు ఎల్‌ఓసీ రూపంలో ఆర్థిక సహాయం అందించింది. మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో భరోసాగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. సహాయం అందించిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## వర్ల రామయ్యకు ఎమ్మెల్యే బూర్ల శుభాకాంక్షలు



గుంటూరు ఆగస్టు 27 వార్త సాక్ష్యం

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యను ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. వర్ల రామయ్యకు ఎమ్మెల్సీ పదవి దక్కడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. టీడీపీకి ఆయన అందించిన సుదీర్ఘ సేవలు, పార్టీ పట్ల అంకితభావం,ఖబ విశ్వసనీయతకు ఈ పదవి సముచిత గౌరవమని పేర్కొన్నారు. అనంతరం ఇరువురు పార్టీ, రాజకీయ వ్యవహారాలపై కొద్దిసేపు ఆత్మీయంగా చర్చించారు. వర్ల రామయ్య ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, అన్నాబత్తుని జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## టవర్ నిర్మాణంపై కాలనీ వాసుల నిరసన దీక్ష



బాపట్ల ఆగస్టు 27 వార్త సాక్ష్యం

బాపట్ల పట్టణంలోని 11వ వార్డు రాజీవ్‌నగర్ కాలనీలో జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కాలనీ వాసులు రెండు రోజులుగా నిరసన దీక్ష చేపట్టారు. ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా టవర్ నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆరోపిస్తూ వందలాది కుటుంబాలు ఆందోళనకు దిగాయి.చిన్నారులు, మహిళలు, వృద్ధులతో సహా కాలనీ వాసులు టవర్ నిర్మాణ ప్రాంతం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. సెల్ టవర్ నుంచి వెలువడే రేడియేషన్ వల్ల తమ ఆరోగ్యానికి, పిల్లల భవిష్యత్తుకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జనావాసాల మధ్య టవర్ నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.గతంలో ప్రజల అభ్యంతరాల నేపథ్యంలో పనులు నిలిచిపోయినప్పటికీ తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించడంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టవర్ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిబంధనలపై అధికారులు వెంటనే విచారణ చేపట్టి పనులను నిలిపివేయాలని కోరారు.జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే రాస్తారోకో, మున్సిపల్ కార్యాలయం ముట్టడి, కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపడతామని హెచ్చరించారు. జనావాసాలకు దూరంగా సెల్ టవర్‌ను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించాలని కోరారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 28 ఆగష్టు 2026

# బిజినెస్

## రైడింగ్ స్టైల్ మార్చుకోవచ్చు యమహా కొత్త బైక్‌లో ఈ ఫీచర్ అదుర్స్!



యమహా మోటార్ ఇండియా కొత్త స్పోర్ట్స్ బైక్ వైజెడ్‌ఎఫ్-ఆర్2ను భారత మార్కెట్లో విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ. 2.30 లక్షలు (ఎక్స్-షోరూమ్). టాప్ వేరియంట్ ఆర్2ఎం ధర రూ. 2.53 లక్షలు. సెప్టెంబర్ 2026 నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి. ఆర్15 తర్వాత ఆర్-సిరీస్‌లో మరో బైక్‌గా వైజెడ్‌ఎఫ్-ఆర్2 చేరింది. వైజెడ్‌ఎఫ్-ఆర్2లో కొత్తగా రూపొందించిన ఛాసిస్ ఇచ్చారు. ఆర్15తో పోలిస్తే దీని బరువు రెండు కిలోలకు పైగా తగ్గింది. అయినా ఛాసిస్ దృఢత్వాన్ని కొనసాగించారు. బైక్ మొత్తం బరువు 149 కిలోలు. దీంతో ఈ విభాగంలో తేలికైన బైక్‌గా నిలిచింది. ఈ బైక్‌లో కొత్త 204 సీసీ, లిక్విడ్-కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఉంది. ఇది 26.1 బీహెచ్‌పీ శక్తిని, 19.1 ఎన్‌ఎం గరిష్ఠ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఆరు గేర్ల గేర్‌బాక్స్ ఇచ్చారు. స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్ ప్రామాణికంగా వస్తుంది. మిడ్, ఎమ్ వేరియంట్లలో క్విక్‌షిఫ్టర్ కూడా ఉంటుంది. బైక్ ముందు భాగంలో 282 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్ ఉంది. వెనుక వైపున కూడా డిస్క్ బ్రేక్ ఇచ్చారు. ముందు ఇన్వర్టెడ్ ఫోర్కులు, వెనుక మోనోషాక్ సస్పెన్షన్ ఉన్నాయి. 17 అంగుళాల వీల్స్ ఉన్నాయి. సీటు ఎత్తు 810 మిల్లీమీటర్లు. ఆర్-సిరీస్ తరహాలోనే వైజెడ్‌ఎఫ్-ఆర్2 డిజైన్ చేశారు. ఫుల్ ఫెయిరింగ్, ఎల్‌ఈడీ లైట్లు, డీఆర్‌ఎల్స్, షార్ప్ టెయిల్ దీని స్పోర్టీ లుక్‌ను పెంచుతున్నాయి. మెటాలిక్ బ్లాక్, డార్క్ బ్లూయిష్ గ్రే, మ్యాట్ వైట్ పెర్ల్, రేసింగ్ బ్లూ, మెటాలిక్ గ్రే రంగుల్లో లభిస్తుంది. రైడర్లు స్ట్రీట్, రెయిన్, స్పోర్ట్, కస్టమ్ అనే నాలుగు రైడింగ్ మోడ్‌లను ఎంచుకోవచ్చు. ఆర్2ఎంలో టీఎఫ్‌టీ స్క్రీన్, స్మార్ట్ కీ, అడ్జస్టబుల్ లివర్ల వంటి అదనపు ఫీచర్లు ఉన్నాయి.

## ఈ కంపెనీలో 80 శాతం మంది ఉద్యోగులు కోటీశ్వరులు.. అదెలా సాధ్యమైంది?




కృత్రిమ మేధ (ఏఐ) బూమ్ చిప్ దిగ్గజం ఎన్విడియా ఉద్యోగుల సంపదను భారీగా పెంచింది. ఆ సంస్థలో పనిచేస్తున్న వారిలో దాదాపు 80 శాతం మంది కోటీశ్వరులుగా ఉన్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. అంతేకాదు.. సుమారు సగం మంది ఉద్యోగుల నికర సంపద 25 మిలియన్ డాలర్లు (సుమారు రూ.239 కోట్లు) దాటినట్లు తెలిపింది. ఈ వివరాలు 2025 జూన్‌లో నిర్వహించిన అంతర్గత సర్వే ఆధారంగా వెల్లడయ్యాయి. 3,000 మందికి పైగా ఉద్యోగులు ఇందులో పాల్గొన్నారు. అప్పట్లో ఎన్విడియాలో సుమారు 30 వేల మంది ఉద్యోగులు ఉండగా.. మొత్తం సిబ్బందిలో దాదాపు 10 శాతం మందిని ఈ సర్వేలో భాగం చేశారు. ఎన్విడియా ఉద్యోగుల సంపద పెరగడానికి సంస్థ షేర్లు కీలకంగా మారాయి. ఉద్యోగులు కంపెనీ షేర్లను 15 శాతం డిస్కౌంట్‌తో కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఏఐ చిప్‌లకు డిమాండ్ పెరగడంతో ఎన్విడియా షేరు విలువ భారీగా పెరిగింది. దీంతో షేర్లు కలిగిన ఉద్యోగుల సంపద కూడా గణనీయంగా పెరిగింది. అయితే ఈ గణాంకాలను చూసి, ఉద్యోగుల వద్ద అంతే మొత్తంలో నగదు ఉందని అర్థం కాదు. వారి నికర సంపదలో కంపెనీ షేర్లు సహా ఇతర ఆస్తులు కూడా ఉంటాయి. ఏఐ రంగం విస్తరణతో ఎన్విడియా మార్కెట్ విలువ భారీగా పెరిగింది. ఆ సమయంలో కంపెనీ మార్కెట్ విలువ రూ. 4.19 లక్షల కోట్లకు పైగా.. సీఈఓ జెన్సన్ హువాంగ్ సంపద రూ. 15 లక్షల కోట్లకు పైగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

## 59 కోట్లకు చేరిన జన్‌ధన్ ఖాతాలు.. వీటిల్లో ఎంత డబ్బుందో తెలుసా?




దేశంలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) ఖాతాల సంఖ్య 59 కోట్లు దాటింది. ఈ ఖాతాల్లో మొత్తం రూ. 3.17 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. 2014 ఆగస్టు 28న ప్రారంభమైన ఈ పథకం 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. జన్‌ధన్ ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోనే ఉన్నాయి. సుమారు 56 శాతం ఖాతాలు మహిళల పేరిట ఉన్నాయి. పేదలు, మారుమూల ప్రాంతాల ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 ఆగస్టు 19 నాటికి ఒక్కో ఖాతాలో సగటున రూ. 5,356 ఉన్నాయి. గత 12 ఏళ్లలో ఒక్కో ఖాతాకు సగటు డిపాజిట్ 3.4 రెట్లు పెరిగింది. ఖాతాలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారని, పొదుపు అలవాటు పెరిగిందని ఇది సూచిస్తోందని ఆర్థిక శాఖ తెలిపింది. జన్‌ధన్ ఖాతాదారులకు ఉచిత రూపే డెబిట్ కార్డు లభిస్తుంది. దీనితో రూ. 2 లక్షల ప్రమాద బీమా ఉంటుంది. అత్యవసర సమయంలో రూ. 10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం కూడా ఉంది. జన్‌ధన్-ఆధార్-మొబైల్ (జేఏఎం) వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతోంది. మధ్యవర్తులు, జాప్యానికి అవకాశం లేకుండా ఆర్థిక సాయం అందుతోందని కేంద్రం తెలిపింది.

## ప్రధాని మోదీ బలమైన సందేశం ఇచ్చారు: క్రికెటర్ తిలక్ వర్మ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువత, క్రీడాకారులతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో టీమిండియా టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ కూడా పాల్గొన్నాడు. 'ఖేలో ఇండియా డైలాగ్' పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఇచ్చిన సందేశంపై ఈ డాషింగ్ బ్యాటర్ ప్రశంసలు కురిపించాడు. క్రీడల ద్వారా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండవచ్చని, 2036 ఒలింపిక్స్‌లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ప్రధాని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమ ప్రసారానికి హాజరైన తిలక్ వర్మ, అనంతరం మీడియాతో మాట్లాడాడు. "ఇది చాలా మంచి కార్యక్రమం. ప్రధాని మోదీ యువతకు బలమైన సందేశాన్ని ఇచ్చారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండటం అత్యవసరం. ఇలాంటి కార్యక్రమాలు యువతను చెడు మార్గాల నుంచి దూరం చేయడానికి ఎంతగానో దోహదపడతాయి" అని అన్నాడు. తాను గతంలో క్రికెట్ ఆడేందుకు ఛత్తీస్‌గఢ్‌కు వచ్చానని, ఇక్కడ క్రీడలకు మంచి భవిష్యత్తు ఉందని అభిప్రాయపడ్డాడు.

**-క్రీడలతో డ్రగ్స్‌కు దూరం: ప్రధాని మోదీ**

ఈ వర్చువల్ సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడటంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని నొక్కిచెప్పారు. "నిజమైన క్రీడాకారులు ఎప్పుడూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే తపనతో ఉంటారు. నేడు యువత డ్రగ్స్ అనే పెను సవాలును ఎదుర్కొంటున్న తరుణంలో, క్రీడలు వారికి రక్షణ కవచంలా నిలుస్తాయి" అని పేర్కొన్నారు.

**-2036 ఒలింపిక్స్‌పై దృష్టి**

2036 ఒలింపిక్స్‌ను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని మోదీ పిలుపునిచ్చారు. "ఒలింపిక్స్‌లో జరిగే సగానికి పైగా క్రీడాంశాల్లో భారత జట్లు పాల్గొనకపోవడం బాధాకరం. చాలా కాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీనివల్ల పతకాల పట్టికలో మన స్థానంపై తీవ్ర ప్రభావం పడుతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. సర్ఫింగ్, స్పోర్ట్స్ క్లైంబింగ్ వంటి కొత్త క్రీడల్లో మన దేశానికి అపార అవకాశాలు ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలన్నారు. 5 నుంచి 15 ఏళ్లలోపు పిల్లల్లో క్రీడా నైపుణ్యాలను గుర్తించేందుకు దేశవ్యాప్తంగా టాలెంట్ హంట్ నిర్వహించడం ద్వారా భవిష్యత్ ఛాంపియన్లను తయారు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి, క్రీడాశాఖ మంత్రి అరుణ్ సావో కూడా పాల్గొన్నారు. ప్రధాని మోదీ మాటలు యువతలో కొత్త ఉత్తేజాన్ని నింపాయని, డ్రగ్స్ రహిత యువతతోనే అభివృద్ధి చెందిన భారత్ సాధ్యమని ఆయన అన్నారు.

## లంకపై టెస్ట్ సిరీస్ గెలిచినా డబ్ల్యూటీసీలో టీమిండియా స్థానం అదే!



శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. అయితే, ఈ విజయం టీమిండియాకు పూర్తిస్థాయి ఆనందాన్ని ఇవ్వలేకపోయింది. కొలంబో వేదికగా జరిగిన రెండో టెస్టు డ్రాగా ముగియడంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ డ్రా కారణంగా విలువైన పాయింట్లు కోల్పోయిన శుభ్‌మన్ గిల్ సేన, పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలోనే నిలిచిపోయింది. సిరీస్ గెలిచినప్పటికీ, పట్టికలో పురోగతి సాధించలేకపోవడం జట్టును నిరాశపరిచింది. రెండో టెస్టు ప్రారంభానికి ముందు 53.33 పాయింట్ల శాతంతో (పీసీటీ) ఉన్న భారత్, ఈ డ్రా ఫలితంతో 51.52 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పట్టికలో 2023 విజేత ఆస్ట్రేలియా (80%), 2025 విజేత దక్షిణాఫ్రికా (75%), 2021 ఛాంపియన్ న్యూజిలాండ్ (72.22%), బంగ్లాదేశ్ (55.56%) తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. వారి తర్వాత భారత్ ఐదో స్థానంలో కొనసాగుతోంది.

మరోవైపు, ఈ మ్యాచ్‌ను విజయవంతంగా డ్రా చేసుకున్న శ్రీలంక 33.33 పీసీటీతో ఆరో స్థానంలో ఉంది. ఎస్ఎస్‌సీ మైదానంలో జరిగిన రెండో టెస్టులో చివరి రోజు భారత్ గెలుపు ఖాయమనిపించింది. కానీ, శ్రీలంక బ్యాటర్ సోనల్ దినుష (133 నాటౌట్) అద్భుతమైన పోరాట పటిమతో వీరోచిత శతకం బాది టీమిండియా ఆశలపై నీళ్లు చల్లాడు. 16 పరుగుల స్వల్ప ఆధిక్యంతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన లంక, తొలి సెషన్‌లోనే వికెట్ నష్టపోకుండా 100 పరుగులు జోడించింది. దినుషకు కేశర నువంత (46) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు.

# స్పోర్ట్స్

## శ్రీలంకతో రెండో టెస్టు డ్రా.. టెస్ట్ క్రికెట్ గెలిచిందన్న టీమిండియా కెప్టెన్ గిల్



భారత్, శ్రీలంక మధ్య కొలంబోలో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆఖరి రోజు భారత బౌలర్లను లంక బ్యాటర్లు సమర్థంగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా, సోనల్ దినుష (133 నాటౌట్) అజేయ సెంచరీతో వీరోచితంగా పోరాడి మ్యాచ్‌ను కాపాడాడు. రెండో టెస్టు డ్రా అయినప్పటికీ, రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. క్లీన్‌స్వీప్ చేయాలన్న టీమిండియా ఆశలు నెరవేరలేదు. మ్యాచ్ అనంతరం టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. తమ వ్యూహాల్లో ఎలాంటి పొరపాటు లేదని స్పష్టం చేశాడు. "నిజాయతీగా చెప్పాలంటే, మేం చేయగలిగిందంతా చేశాం. మూడు రోజుల పాటు ఫీల్డింగ్ చేశాం. కానీ లంక బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. వారికి కొద్దిగా అదృష్టం కూడా కలిసొచ్చింది" అని గిల్ అన్నాడు. ఫాలో-ఆన్ నిర్ణయంపై మాట్లాడుతూ.. "జరిగిపోయిన తర్వాత దేని గురించైనా మాట్లాడొచ్చు. కానీ ఆ క్షణంలో ఏది ఉత్తమమనిపిస్తుందో ఆ నిర్ణయమే తీసుకుంటాం. ఈరోజు టెస్ట్ క్రికెట్ గెలిచింది" అని వ్యాఖ్యానించాడు. ఈ సిరీస్‌లో తమకు ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయని గిల్ తెలిపాడు. దేవ్‌దత్ పడిక్కల్, కేఎల్ రాహుల్, మానవ్ సుతార్ అద్భుతంగా రాణించారని ప్రశంసించాడు. ముఖ్యంగా, సిరీస్‌లో 16 వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్‌పై గిల్ ప్రశంసల వర్షం కురిపించాడు. "అతని బౌలింగ్‌లో స్థిరత్వం, బంతిని రిలీజ్ చేసే విధానం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. భవిష్యత్తులో అతను మాకు కీలక బౌలర్ కాబోతున్నాడు" అని గిల్ వివరించాడు.

# 'లూజర్' సాంగ్- 'ఐయామ్ గేమ్' కోసం

# గాయకుడిగా మారిన దుల్కర్ సల్మాన్

యూత్ ఐకాన్, విలక్షణ నటుడు దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఐయామ్ గేమ్'. నహాస్ హిదాయత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఈ సినిమా నుంచి అభిమానుల కోసం 'లూజర్' అనే గీతాన్ని మేకర్స్ గురువారం విడుదల చేశారు. మలయాళంలో ఈ పాటను స్వయంగా దుల్కర్ సల్మాన్ ఆలపించడం విశేషం. 'లూజర్' అనే పదాన్ని సాధారణంగా నెగటివ్‌గా చూస్తారు. కానీ ఈ పాటలో మాత్రం దాన్ని చాలా సరదాగా, పాజిటివ్‌గా సెలబ్రేట్ చేసుకునేలా చిత్రీకరించారు. సినిమాలోని పాత్రల స్వభావాలను, వారి అస్తవ్యస్తమైన ప్రపంచాన్ని ఈ పాట సరదాగా పరిచయం చేస్తుంది. జేక్స్ బిజోయ్ అందించిన సంగీతం, సుహైల్ కోయా సాహిత్యం పాటకు మరింత ఊపునిచ్చాయి. తెలుగులో ఈ పాటకు సనారే సాహిత్యం అందించగా, బెన్నీ దయాళ్ ఆలపించాడు. ఈ పాట గురించి దుల్కర్ మాట్లాడుతూ, "'లూజర్స్'ను సెలబ్రేట్ చేసే పాట ఇది. చాలా సరదాగా అనిపించింది. దీన్ని పాడే అవకాశం కూడా నాకు లభించింది" అని అన్నారు. సినిమాలో తన పాత్ర గురించి చెబుతూ, "ఈ చిత్రంలో నేను చాలా అల్లరిచిల్లరగా ఉండే పాత్రలో కనిపిస్తాను. ఇది నిజ జీవితంలో నాకు పూర్తి భిన్నమైనది. సినిమా చివరికల్లా నా పాత్రలో మార్పు వచ్చి, మీ అందరినీ మళ్ళీ గెలుచుకుంటానని ఆశిస్తున్నాను" అని వివరించారు. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ఈ పాటను విడుదల చేసినట్లు దుల్కర్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. వాస్తవానికి ఈ సినిమా ఆగస్టు 20న విడుదల కావాల్సి ఉండగా, సెప్టెంబర్ 3కి వాయిదా పడింది. మరింత విస్తృతంగా, ఎక్కువ థియేటర్లలో విడుదల చేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు దుల్కర్ గతంలో ఓ ప్రకటనలో వెల్లడించారు. "గేమ్ పెద్దది అవుతోంది, విడుదల కూడా విస్తృతంగా ఉంటుంది. ఈ సినిమాను సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను దుల్కర్ సల్మాన్ తన సొంత నిర్మాణ సంస్థ వేఫేరర్ ఫిల్మ్స్‌పై జోమ్ వర్గీస్‌తో కలిసి నిర్మించారు. దాదాపు 11 నెలల పాటు 156 రోజుల షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రాన్ని దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లొకేషన్లలో చిత్రీకరించారు. ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, కయాదు లోహర్, కదిర్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటించగా, అన్బరివ్ మాస్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ అందించారు.







## రకుల్ నోట శూర్పణఖ కథ

## తెలియని విషయాలు బయటపెట్టిన నటి!

రామాయణంలో శూర్పణఖ అంటే చాలామందికి వెంటనే గుర్తుకొచ్చేది ప్రతినాయకురాలి పాత్రే. కానీ, 'రామాయణ' చిత్రంలో తాను పోషిస్తున్న శూర్పణఖ పాత్రలో అంతకుమించిన కోణాలున్నా యని నటి రకుల్ ప్రీత్ సింగ్ చెప్పింది. ఆ పాత్రలోని అనేక అంశాలు తనను ఈ సినిమా వైపు ఆకర్షించాయని తెలిపింది. రావణుడి సోదరిగా శూర్పణఖ పాత్రలో రకుల్ కనిపించనుంది. లంకలో అత్యంత అందమైన మహిళల్లో ఆమె ఒకరని చెబుతారని రకుల్ గుర్తుచేసుకుంది. ఆమెకు అహంకారం ఉన్నప్పటికీ.. పాత్రలో చాలా కోణాలున్నాయని చెప్పింది. నటిగా అలాంటి పాత్రలను ఆవిష్కరించడం ఆసక్తికరంగా ఉంటుందని తెలిపింది. స్క్రిప్ట్ చదివే వరకు శూర్పణఖ జీవితం గురించి తనకు తెలియని విషయాలు చాలానే ఉన్నాయని రకుల్ చెప్పింది. లక్ష్మణుడు ఆమె ముక్కు కోసిన ఘటనకు ముందు, తర్వాత జరిగిన పరిణామాలను సినిమాలో కొత్త కోణంలో చూపిస్తున్నట్లు వెల్లడించింది. రాముడిని శూర్పణఖ ఎలా కలుస్తుందన్న విషయాల్లోనూ కొత్త అంశాలు తెలుసుకున్నానని తెలిపింది. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోంది. 'రామాయణ: పార్ట్–1' 2026 నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## ఈ పరిశ్రమ అందరిదీ.. ఏ కొందరిదో కాదు: రవితేజకు అభినందనలు తెలిపిన చిరంజీవి

మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' చిత్రం ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని, ముఖ్యంగా రవితేజను మనస్ఫూర్తిగా అభినందిస్తూ సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. ఈ విజయం పట్ల తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూనే, చిత్ర పరిశ్రమ ఐక్యతపై కీలక వ్యాఖ్యలు చేశారు. "నా ప్రియ సోదరుడు రవికి 'ఇరుముడి' బ్లాక్‌బస్టర్ విజయం సాధించినందుకు హృదయపూర్వక అభినందనలు. సినిమాను మొదటి నుంచి చివరి వరకు పూర్తిగా ఆస్వాదించాను" అని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రవితేజ నటనను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, "త్రినాథ్ పాత్రను నువ్వు అద్భుతంగా నీ భుజాలపై మోశావు. అసాధారణమైన నటన కనబరిచావు" అని కొనియాడారు. సినిమాను ఎంతో భావోద్వేగభరితంగా, లోతుగా తెరకెక్కించిన దర్శకుడు శివ నిర్వాణ పనితీరును కూడా మెచ్చుకున్నారు.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.